రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.17, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.20, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.23, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.45, మునగ రూ.55, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.17, కీర రూ.23, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.33. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మూసారంబాగ్ చౌరస్తా, నల్లగొండ క్రాస్‌రోడ్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సౌత్ ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ రవీందర్‌రెడ్డి, ఏసీపీ చంద్రకుమార్ వితౌట్ నంబర్ ప్లేట్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను పర్యవేక్షించారు. నంబర్‌ప్లేట్లు లేని 10 ద్విచక్ర వాహనాలు సీజ్, 15 మంది వాహనదారులపై రాంగ్ సైడ్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసినట్లు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అధికారులు కోరారు. స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్సైలు రాము, యాదయ్య, రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో వ్యక్తికి జీవితఖైదు



ఆంటోని

హస్తినాపురం: మహిళను హత్యచేసిన కేసులో నిందితుడికి జీవితఖైదు విధించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ టీవీ ప్రసాద్ వివరాల ప్రకారం.. 2015లో వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్లు దుకాణంలో తలెత్తిన ఓ వివాదంలో క్షణికావేశానికి గురైన ఆంటోని(38) మహిళను కత్తితో పొడిచి హత్యచేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సరూర్‌నగర్ మండలం గుర్రంగూడకు చెందిన ఆంటోనిని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా సాక్ష్యాధారాలను పరిశీలించిన ఎల్‌బీనగర్‌లోని జిల్లా నాలుగో అదనపు న్యాయమూర్తి నిందితుడికి జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

వ్యక్తి అదృశ్యం



ప్రశాంత్

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..రాఘవేంద్రనగర్ కాలనీలో నివాసముండే అత్యం ప్రశాంత్(35) నగరంలో ఎస్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 3న బ్యాంకు పని కోసం బయటకు వెళ్లాల్సి ఉందని కుటుంబ సభ్యులకు చెప్పి తన చెక్ బుక్‌లను తీసుకొని ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా ఆలస్యంగా వస్తానని చెప్పాడు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చలివేంద్రాల ఏర్పాటుకు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: వేసవికాలం నేపథ్యంలో కార్పొరేషన్ పరిధి ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండుటెండల్లో బాటసారుల దాహార్తి తీర్చేందుకు.. కార్పొరేషన్ తరుపున చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్- 1,2 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మహిళామోర్చా నాయకురాలు నివేదిత, అగిరిశెట్టి సైదులు, ప్రవీణ్‌గౌడ్ ఉన్నారు.

ఖాళీ స్థలాలు.. వ్యర్థాలకు నిలయాలు

- పేరుకుపోతున్న చెత్తా చెదారం
- విజృంభిస్తున్న దోమలు, ఈగలు



ఎస్‌బీహెచ్ కాలనీలో



బాలాజీనగర్ కాలనీలో ఖాళీ స్థలంలో నిండిపోయిన వ్యర్థాలు

సైదాబాద్: కాలనీలు, బస్తీల్లోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకుపోతుండటంతో దుర్గంధంగా మారుతున్నాయని ఆయా ప్రాంతాలవాసులు వాపోతున్నారు.ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లోని ఖాళీ ప్లాట్లు చెత్తా చెదారాలు, వ్యర్థాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఎప్పుడో ఏర్పడిన ఆయా కాలనీల్లో అక్కడక్కడ కొన్ని ప్లాట్లు ఇంత కాలంగా ఖాళీగానే ఉంటున్నాయి. ఇదే అవకాశంగా చేసుకుంటున్న పలువురు ఆ ఖాళీ స్థలాల్లో చెత్త, వ్యర్థాలు పారబోస్తుండటంతో మురికి కూపంగా మారుతున్నాయి.

దుర్గంధంగా కాలనీలు..

సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలలో ఖాళీ స్థలాల యజమానుల తీరు సమస్యను అధికం చేస్తుంది. ఇక్కడ స్థలాలు కొన్నవారు దూరంగా ఎక్కడో ఉండటం, ఇక్కడి స్థలాలను పట్టించుకోకపోవటం సమస్యకు దారితీస్తోంది. ఖాళీ స్థలాల్లో పడేస్తున్న వ్యర్థాలు, చెత్తతో దుర్గంధంగా మారి ఈగలు దోమలు విజృంభిస్తున్నాయని పలువురు వాపోతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమల వ్యాప్తి పెరుగుతుందని కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రహరీలు నిర్మించుకోవాలి..

కాలనీలోని తమ ఖాళీ ప్లాట్లను వాటి యజమానులే సంరక్షించుకోవాలి. ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న తమ స్థలాలను సంరక్షించుకోకపోతే అవి కబ్జాలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. యజమానులు అనవసరపు వివాదాల్లో చిక్కే అవకాశం ఉంటుందని తమ ఖాళీ ప్లాట్లకు రక్షణ చర్యలు చేపట్టుకోవాలంటున్నారు. ప్రహరీ, గేట్లు ఏర్పాటు చేసుకుంటే ఎవరూ కూడా ప్లాట్లలో చెత్త వేయకుండా ఉంటారన్నారు. ఖాళీ ప్లాట్ల యజమానుల మూలంగా ఇతర కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు.

ఇతరులను ఇబ్బంది పెట్టొద్దు



వ్యర్థాలు, చెత్త పేరుకుపోయిన ఖాళీ ప్లాట్ల కారణంగా ఇతర కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలు నిండిన ఖాళీ ప్లాట్లకు మరీ సమీపంలో ఉండే వారు దుర్గంధం, దోమలతో అవస్థలు పడుతున్నారు. ఆయా ప్లాట్ల యజమానులు తమ స్థలాలను తామే సంరక్షించుకోవాలి. తమ తమ స్థలాలకు ప్రహరీ నిర్మించుకుంటే ఎవరూ చెత్త వేయకుండా ఉంటారు.

– లక్ష్మణ్ ఠాకూర్, సైదాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి

తప్పుడు వార్తలతో ఆందోళన చెందొద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఇటీవల బీఎన్‌రెడ్డినగర్‌లో పలు కాలనీ రిజిస్ట్రేషన్‌పై సామాజిక మధ్యమాల్లో వస్తున్న వార్తలను చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. 118జీఓ కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి కన్వీనెన్స్ డీడ్ ఇప్పించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. సాహెబ్‌నగర్ కలాన్ 201/1 సర్వే నెంబర్‌లో రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ఇటీవల గుర్రంగూడ ఎఫ్‌ఆర్‌ఓ నుంచి వనస్థలిపురం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి లేఖ రావడంతో రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన డీఎఫ్‌ఓ సుధాకర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. 201బై1 సర్వే నెంబర్‌లో 102 ఎకరాల అటవి శాఖ స్థలం ఉందని వాటిపై మాత్రమే పలువురు ప్రైవేట్ వ్యక్తులు కేసులు వేశారన్నారు. మరో 77 ఎకరాల్లో గతంలో హుడా లేఔట్‌కు అటవి శాఖ అధికారులు ఎన్‌ఓసీ ఇవ్వడం జరిగిందని డీఎఫ్‌ఓకు వివరించారు. లేఖను ఇవ్వాల్సిందిగా డీఎఫ్‌ఓ కోరడంతో మంగళవారం హుడా కాలనీ సంక్షేమ సంఘ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సైఫాబాద్‌లోని అరణ్యభవన్‌లో డీఎఫ్‌ఓను కలిసి లేఖను అందజేసి పూర్తి వివరాలను వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అరవింద్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ధన్‌రాజ్, అమరేందర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట మూసీ పరిసర ప్రాంతాల్లో దోమల నిరవాణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. మూసీ పరిసర ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉండటంతో కార్పొరేటర్, సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం డ్రోన్ ద్వారా సత్యనగర్ కాలనీ, జనప్రియ, బృందావన్ కాలనీ, సమతపురి కాలనీ సమీపంలో ఉన్నటువంటి మూసీ నదిలో పిచికారీ చేయించారు. అనంతరం గుర్రపు డెక్కను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి, కిషోర్, కొత్త తిరుమల, తోట మహేందర్ యాదవ్, పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

నాగోలు: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 9న నిర్వహించనున్న పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత తెలిపారు. మంగళవారం కొత్తపేటలో పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పున్న గణేష్‌నేత మాట్లాడుతూ.. ఆరేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఈ మహాసభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారన్నారు. భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తున్న చేనేత కళను పరిరక్షిస్తూ పెరుగుతున్న జీవన వ్యయంతో గిట్టుబాటు కాకున్నా చేనేత వృత్తినే నమ్ముకొని పోరాటం చేస్తున్న నేతన్నల సమస్యల గురించి ప్రభుత్వం నుంచి తగు ప్రోత్సాహం అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రవితేజ, జగన్నాథం, రమేష్, సూర్యకాంత్, రవీందర్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి 28వ డివిజన్ కాలనీలో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ మేనేజర్ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందచేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. శ్రీమారుతినగర్ కాలనీలో డ్రైనేజీ పనులు పూర్తి చేయకుండా వదిలేశారని ఆరోపించారు. కాలనీ డ్రైనేజీలను అవుట్‌లెట్‌కు అనుసంధానం చేయకుండా నిలిపివేశారని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన కాలనీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. 1,8,9 లైన్లలో డ్రైనేజీని అసంపూర్తిగా వదిలివేశారని, 5,6,7 లైన్లను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫలితంగా ఈగలు, దోమలు పెరిగి ఇబ్బంది పడుతున్నామన్నారు.
అధికారులు స్పందించి అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అగిరిశెట్టి సైదులు, ప్రవీణ్, చైతన్య, మహేశ్, బాపనయ్య, అరవింద్, శ్రీనివాస్, యాదగిరి, మహేందర్, రతన్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

పహాడీషరీఫ్: లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా లేఅవుట్ చేసిన వెంచర్‌లలోని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసేకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్ కోసం గతంలో రూ.1000 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్ల యజమానులు అర్హులన్నారు. అనధికారిక లేఅవుట్‌లలోని ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ఈ నెల 31వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకున్నవారు ప్రభుత్వ గడువులోపు ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకుంటే ఎల్‌ఆర్‌ఎస్ మొత్తం ఫీజులో 25శాతం రాయితీని ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సలీంనగర్ కరాచి బేకరీ సమీపంలో..



మూసారంబాగ్ మెట్రో షాపింగ్ మాల్ వద్ద..



ఎస్‌బీహెచ్ కాలనీ రోడ్డు యూనివర్సల్ జిమ్ లైన్‌లో..



అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. మలక్‌పేట

పర్యవేక్షణ కరువైంది.. నాణ్యత లోపించింది

నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేపట్టారు. మరమ్మతులు చేసినా వారం రోజులకే మ్యాన్‌హోళ్ల, క్యాచ్ పిట్లు ధ్వంసమయ్యాయి. మూసారంబాగ్, సలీంనగర్, దిల్‌సుఖ్‌నగర్, అక్బర్‌బాగ్ ప్రాంతాలలో నిర్మించిన వాటికి క్యూరింగ్ చేయకపోవడంతో, పెచ్చులూడి దుమ్ము లేస్తోంది. రూ. లక్షల్లో ఖర్చుచేసిన నిర్మిస్తున్న క్యాచ్‌పిట్లు కొన్ని రోజులకే ధ్వంసం అవుతుండటంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

–మలక్‌పేట



దిల్‌సుఖ్‌నగర్ శశి ఆసుపత్రి లైన్‌లో..

రక్తదానం చేయడం అభినందనీయం



రక్తదానం చేస్తున్న క్రియేటివ్ మల్టీ మీడియా విద్యార్థులు, సిబ్బంది

మలక్‌పేట: సామాజిక సేవా దృక్పథంతో తలసీమియా వ్యాధి బారిన పడిన చిన్నారుల కోసం విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయని అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డీసీపీ మధుకర్ స్వామి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దిల్‌సుఖ్‌నగర్ క్రియేటివ్ మల్టీమీడియా సంస్థలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ బుగ్గవీటి మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ తలసీమియా బాధితుల కోసం ప్రతీ సంవత్సరం రెడ్‌క్రాస్ సొసైటీతో కలిసి రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది కలిసి 100 యూనిట్ల రక్తం దానం చేశారని పేర్కొన్నారు. రక్తదానం చేసిన వారికి డీసీపీ చేతుల మీదుగా సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా



పవనగిరికాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్‌లోని వివేకానందనగర్‌కాలనీ, జడ్జెస్‌కాలనీ, హయత్‌నగర్ పరిధిలోని వీరన్నగుట్ట, పవనగిరికాలనీలలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..వివేకానందనగర్ కాలనీలో రూ.50లక్షలతో యూజీడీ పనులు వారం రోజుల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. వీరన్నగుట్ట బస్తీని పోచమ్మ ఆలయం వద్ద రూ.50 లక్షలతో ఎల్-షేప్ సీసీ రోడ్డు పనులు, సహారాస్టేట్స్‌కాలనీ సెకండ్ గేటు వద్ద నుంచి ప్రధాన రోడ్డును రూ.30 లక్షలతో సీసీరోడ్డు, పవనగిరికాలనీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులు త్వరలో ప్రారంభవుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీలవాసులు సయ్యద్ జానీ, విజయభాస్కర్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, హరిప్రసాద్, సైదిరెడ్డి, సాయిలుగౌడ్, పుష్పలత, మాధవరెడ్డి, ఆకుల సత్యం, నవీన్‌రావు, రమేష్‌చారి, నాయకులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



చాదర్‌ఘాట్: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేంద్ర మోహన్‌కు టీఎస్‌జీఓ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల రాష్ట్ర ఫోరం ప్రతినిధులు మంగళవారం ఆయనను కార్యాలయంలో కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, ముక్రం, వెంకటేశం, సంతోష్, దామోదర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నాగోలు: మహిళలు ఆర్థికంగా ఎదగాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళ విభాగం(ఐవీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవంలో భాగంగా 5 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ అభినందనీయమన్నారు. కుట్టు మిషన్లు అందజేసిన ఐవీఎఫ్ వైస్ ప్రెసిడెంట్ వికారాబాద్ సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల స్వప్న, మంజుల, రోజా,సుమ, గీత, శ్వేతా, విద్యా పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా